ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 22.0


ఆలయ ప్రాంగణంలో భక్తులు

ద్వారకా తిరుమలకు పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 25: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. 15 వేల మంది పైబడి భక్తులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. మాఘ మాసం కావడంతో అటు భక్తులతో పాటు ఇటు పెళ్లిళ్ల జనాలు రావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని వకుళ మాత అన్నప్రసాద భవనంలో ప్రసాదాన్ని స్వీకరించారు.

రేపటి నుంచి టెట్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్/ భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 : ఏపీ టెట్-2024 ఆన్‌లైన్ పరీక్షలు జిల్లాలో ఈ నెల 27నుంచి మార్చి 6వ తేదీ వరకు ఎంపిక చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయని డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షార్థులు తమ హాల్‌టిక్కెట్‌లో అభ్యర్థి పేరు/తండ్రి పేరు, జెండర్ తదితర అంశాల్లో ఏవైనా మార్పులుంటే సంబంధిత పరీక్షా కేంద్రంలోనే మార్పు చేస్తారని వివరించారు. విభిన్న ప్రతిభావంతులు పరీక్ష రాసేందుకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం లేదా డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులను సహాయ కులుగా నియమిస్తామన్నారు. పరీక్షార్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు ఐడీతో నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. టెట్ పరీక్షలు జిల్లాలో పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, అగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలలో ఉదయం 9.30 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రోజుకు రెండు సెషన్లలో జరుగుతాయన్నారు.

- పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో టెట్ పరీక్షలు జరుగుతాయని డీఈవో వెంకట రమణ తెలిపారు. భీమవరంలోని డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.


వేణుగోపాలస్వామి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహాల ఊరేగింపు

పాలకోడేరు, ఫిబ్రవరి 25 : పాలకోడేరులో వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్వామి వారి దివ్య విగ్రహాలను మేళతాళలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. సోమవారం, మంగళవారం ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, హోమాల అనంతరం బుధవారం ఉదయం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం, ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు


ఏలూరు సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 76 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 83.68 శాతం, పశ్చిమ గోదావరి జిల్లాలో 84.80 హాజరు శాతం నమోదయ్యాయి.

7


భీమవరం శ్రీవిష్ణు కాలేజీలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న పశ్చిమ గోదావరి జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి



కేరింతలు.. నిరీక్షణలు



కొన్ని నియోజక వర్గాల్లో కేరింతలు. మరికొన్ని చోట్ల కళ్లల్లో ఒత్తులేసుకుని నిరీక్షణ. టిక్కెట్ కబురు కోసం వెంపర్లాట. తెలుగుదేశం-జనసేన ఉమ్మడి పొత్తులో భాగంగా తొలి జాబితాను శనివారం ప్రకటించగా దీనిలో కొందరికి మాత్రమే చోటు దక్కింది. పార్టీలో తమకు తిరుగు లేదని, తొలిగా తమపేరే ఉంటుందని భావించిన కొందరు ఇప్పుడు తికమకపడుతున్నారు. మలి జాబితా ఎప్పుడు ప్రకటిస్తారోనని టెన్షన్‌లో వున్నారు. ఒకవైపు టీడీపీ, మరోవైపు జనసేన లోనూ ఇదే పరిస్థితి. తొలి జాబితాలో చోటు దక్కక అసంతృప్తికి గురైనవారిని బుజ్జగించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. జనసేన జాబితా పైనే ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- జనసేన జాబితాపైనే అందరి దృష్టి
- అక్కడక్కడా అసంతృప్తి, బుజ్జగింపులు
- పెండింగ్ సీట్లలో తీవ్ర అలజడి
- గూడెం సభలోపే అంతా సెట్‌రైట్‌కు అవకాశం

తొలిజాబితాలో ఏలూరు నరసాపురం లోక్‌సభా స్థానాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థులను టీడీపీ ప్రకటించింది. అనూహ్యంగా పార్టీలో సీనియర్లుగా ఉన్న కొందరిని తాత్కాలికంగా పక్కనబెట్టి మరికొందరిని ముందుకు పెట్టారు. రాజకీయంగా కారణాలేమైనా, ఇప్పుడిదే జిల్లా అంతటా హాట్ టాపిక్ అయింది. చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి సొంగా రోషన్ కుమార్ అభ్యర్థిత్వం వేగంగా ముందుకు కదిలింది. ఈ నియోజకవర్గంలో అనిల్ బొమ్మాజీ, ఆకుమర్తి రామారావు పోటీ పడినా రోషన్‌కే అవకాశం ఇచ్చారు. నారా లోకేశ్ సేవా సమితి అధ్యక్షుడిగా, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వున్న రామారావు నియోజకవర్గంలో దాదాపు రాణించారు. ఇదే సందర్భంలో రోషన్ కూడా కరోనా సమయంలో విస్తృతంగా సేవలందించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని వీరిద్దరూ ముందుకు సాగినా రోషన్‌కే ప్రాధాన్యతిచ్చారు. ఇక చింతలపూడిలో అమీతుమీ తేల్చుకోవడానికి టీడీపీ సిద్ధమవుతోంది. ఇంకోవైపు ఉంగుటూరు స్థానం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేరు కూడా జాబితాలో చోటు చేసుకోకపోవడం యాదృచ్ఛికమే అంటున్నారు. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందినవారందరినీ ఒకే జాబితాలో ప్రకటిస్తే సంఖ్యాపరంగా విమర్శలకు దారితీయవచ్చనే భావనతో గన్ని, మరికొందరి పేర్లను మలి జాబితాలో చేర్చబోతున్నారు. ప్రత్యేకించి ఈ నియోజకవర్గంపై కొందరు పనిగట్టుకుని ప్రచారం చేయడం జనసేన అయితే తమకే కేటాయిస్తారని పదేపదే వాదనలకు దిగుతున్న తరుణంలోనే జరిగిన ఈ పరిణామం టీడీపీలో కాస్తా గందరగోళం సృష్టించింది. దెందులూరు నియోజకవర్గంలోనూ చింతమనేని ప్రభాకర్‌కు నూటికి నూరుశాతం టిక్కెట్ ఖాయమైనా తొలిజాబితాలో లేకపోవడం చర్చకు దారితీసింది. గతంలోను ప్రభాకర్‌కు తొలిజాబితాలో చోటు ఇవ్వకపోగా, ఆ తదుపరి జాబితాల్లో స్థానం ఇచ్చిన ఉదాహరణను కొందరు ప్రస్తావిస్తున్నారు. ఈసారి అదే ఆనవాయితీని టీడీపీ పాటించబోతోంది. పోలవరం (ఎస్టీ) నియోజకవర్గంలో ఇప్పటికీ టెన్షన్ తగ్గలేదు. ప్రత్యేకించి ఈ స్థానాన్ని జనసేన కోరుకుంటు న్నట్టు ప్రచారం సాగింది. వాస్తవానికి ఈ నియోజకవర్గంలో టీడీపీ పక్షాన బొరగం శ్రీనివాసరావు అత్యధిక గిరిజన, గిరిజ నేతర వర్గం నుంచి మద్దతు కూడగట్టుకోగలిగారు. అదీగాక పోలవరంలో తెలుగుదేశం విజయం ఆవశ్యకతతో కూడిందని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇదెంతో ప్రా ధాన్యత కలిగినట్టుగా ఆ పార్టీ వర్గాలు భావి స్తున్నాయి. అలాంటప్పుడు తెలుగుదేశం ఈ స్థానాన్ని ఎలా వదులుకోగలదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

మరోవైపు కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి వెంకటేశ్వర రాజు, మరికొందరు ఆశావహులుగా పోటీపడ్డారు. కానీ ఈ స్థానం బీజేపీ పొత్తులోకి వెళ్లబోతుందని సాగుతున్న ప్రచారం ఆనోటా ఈ నోటా మరింత ఉధృతమైంది. ఈ నియోజకవర్గం నుంచి గతంలో కన్వీనర్‌గా వున్న జయమంగళ వెంకట రమణ వైసీపీలో చేరడం వెనువెంటనే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యా రు. అప్పటి నుంచి టీడీపీ నియోజకవర్గ సారథ్య బాధ్యతలు ఎవ్వరికీ అప్పగించలేదు. ఈ స్థానంలో ఆదినుంచి కొంత పట్టున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ చాన్నాళ్ళ నుంచి ప్రజా క్షేత్రంలోనే వున్నారు. ఇంకోవైపు బీజేపీతో టీడీపీ పొత్తు సాగితే ఎలాంటి ఆటంకం లేకుండా చూసేందుకే ఇప్పటి వరకు ఆచితూచి వ్యవహరించారని భావిస్తున్నారు.

బాబ్బాబు... తగ్గండి!

తొలిజాబితాలో టికెట్లు దక్కకపోవడంతో కొన్ని నియోజక వర్గాల్లో అసంతృప్తి సెగ లేచింది. తణుకు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా విడివాడ రామచంద్రరావు పోటీ చేస్తారని ఒక బహిరంగ సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టంగా ప్రకటించారు. ఇప్పుడు తాజా జాబితాలో తణుకు నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణను ప్రక టించారు. దీంతో రామచంద్రరావు కాస్త అలక వహించినట్టు సమాచారం. రాష్ట్రంలో వైసీపీని ఓడించే దిశగా పొత్తులో భాగంగా ఇచ్చిపుచ్చుకోవడం ఉంటుందని, ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పదే పదే అందరికీ చెప్పారని దీనిని అతిక్రమించడం తగదని ఆయనకు పార్టీ పెద్దలు వివరించినట్టు చెబుతున్నారు. అవసరమైతే పవన్ మీతో స్వయంగా మాట్లాడుతారని భరోసా ఇచ్చినా రామచంద్రరావు ఒకింత అసహనంతోనే తదుపరి నిర్ణయాలు ఉంటాయని తన కేడర్ వద్ద ప్రస్తావిస్తున్నట్టు మరో అంశం ప్రచారంలోకి వచ్చింది. ఉండి నియోజకవర్గంలో టీడీపీ టిక్కెట్ దక్కని వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) తీవ్ర అసంతృప్తి తో ఉన్నారు. ఆయన, అనుచర వర్గం కీలక నిర్ణయం తీసు కుందామని, తాడోపేడో తేల్చుకుందామనే ధోరణిలోనే ఉన్నారు. పార్టీ సీనియర్లు ఆయనకు ఏదో రూపంలో నచ్చ చెప్పి బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ, అసెంబ్లీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నిమ్మల రామానాయుడు సహా సీనియర్లంతా శివతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా వుండగా ఉమ్మడి పశ్చిమలో సాధ్యమైనంత మేర ఎక్కడైనా అలకలు, అసంతృ ప్తులు వుంటే వీటన్నిటినీ సద్దుమణిగేలా చేయాలని టీడీపీ, జనసేన భావిస్తున్నాయి.

ఉమ్మడి కసరత్తు..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు సన్నాహాలు
- భారీగా జనసమీకరణ కోసం నేతలు తలమునకలు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. రాజకీయాలు వేడెక్కాయి. తెలుగుదేశం-జనసేన కూటమి తొలివిడత అభ్యర్థులను ప్రకటించింది. తాడేపల్లిగూడెం వేదికగా ఈనెల 28న ఉమ్మడి సభ నిర్వహిస్తున్నారు. ఇక్కడ నుంచే తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. అందుకోసం రెండు పార్టీలు సభను విజయంతం చేయాలని సర్వశక్తులొడ్డుతున్నాయి. దాదాపు ఐదు లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళిక చేశారు. తాడేపల్లిగూడెం జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 25 ఎకరాల్లో సభను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా జిల్లా నుంచి ఉభయ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకానున్నారు. సభను పర్యవేక్షించి విజయవంతం చేసేలా రెండు పార్టీల నుంచి నాయకులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెంలో శనివారం సమన్వయ కమిటీ భేటీ అయ్యింది. భారీగా సభకు జనాలను సమీకరించాలని నిర్ణయించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచే 50 వేల మంది హాజరయ్యేలా చూడాలని రెండు పార్టీల ఇన్‌చార్జ్‌లు వలవల బాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్‌లకు దిశానిర్దేశం చేశారు. ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ బాబ్జి గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ఆదివారం నియోజకవర్గంలో పర్యటించారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరో రెండు రోజులు మాత్రమే వ్యవధి ఉంది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు, కృష్ణాకు అందుబాటులో ఉండడంతో తాడేపల్లిగూడెం నియోజక వర్గాన్ని ఉమ్మడి సభకు ఎంపిక చేశారు. మూడు జిల్లాల్లోనూ ప్రతినియోజకవర్గం నుంచి రెండు పార్టీల కార్యకర్తలు, అభిమానులు భారీ స్థాయిలో తరలి వచ్చేలా ప్రణాళిక చేశారు. అయితే సభ అనంతరం జనం తిరుగు ముఖం పట్టినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. గతంలో చంద్రబాబు సభ నిర్వహించినప్పుడు ఇదే పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే ప్రణాళిక రూపొందిస్తున్నారు. సభకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు రెండు హెలికాప్టర్‌లలో రానున్నారు. అందుకోసం హెలిప్యాడ్‌లు సిద్ధం చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. సభా వేదిక శరవేగంగా సిద్ధమవుతోంది.


ఆదివారం సభా స్థలిని పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు వలవల బాబ్జి, చినబాబు తదితరులు

జనసేనలోకి అంజిబాబు..?

- హైదరాబాద్‌లో పవన్‌తో భేటీ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు రాజకీయంగా క్రియాశీలమయ్యారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో ఆదివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. జనసేనలోకి పులపర్తి చేరికకు మార్గం సుగమం అయ్యింది. హైదరాబాద్ రావాలని శనివారం ఆయనకు సమాచారం అందడంతో వెంటనే బయల్దేరి వెళ్లారు. రెండు గంటలపాటు ఇద్దరి మధ్య చర్చ సాగినట్టు సమాచారం. త్వరలోనే మాజీ ఎమ్మెల్యే పులపర్తి జనసేనలో చేరే అవకాశం ఉంది. ఇటీవల భీమవరం విచ్చేసినప్పుడు పులపర్తి ఇంటికి పవన్‌కల్యాణ్ వెళ్లారు. భీమవరం రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. భీమవరంలో పవన్ కల్యాణ్ పోటీ చేస్తే గెలిపించే బాధ్యతను తీసుకుంటానని పులపర్తి స్పష్టం చేశారు. లేదంటే తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. పవన్ కల్యాణ్ భీమవరంలో పోటీ చేయకపోతే జనసేన నుంచి పులపర్తికి అవకాశం ఉంటుందంటూ ఇప్పుడు నియోజక వర్గంలో చర్చ సాగుతోంది. మొత్తంగా పులపర్తి జనసేనలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.



జరిమానా..కట్టండి!

కాసులు కురిపిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ లేకపోవడంతో కోర్టు కానిస్టేబుళ్లే మేజిస్ట్రేట్ అవతారం
- ఎంత జరిమానా వసూలు చేయాలో రైటర్లకు ఆదేశాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25 : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్‌శాఖ మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించే నిమిత్తం డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బ్రీత్ ఎనలైజర్లతో వాహన డ్రైవర్లు మద్యం తాగి ఉన్నారో లేదో గుర్తిస్తారు. ఆల్కహాల్ 100 ఎంఎల్ కాగా, శరీర రక్తంలో 30 ఎంజీ లోపు అయితే ఎలాంటి కేసులు ఉండవు. బ్రీత్ ఎనలైజర్‌లో 30 ఎంజీ దాటితే వారిపై కేసులు నమోదు చేస్తారు. మోటారు వాహన సెక్షన్ 185ఏ కింద పది వేల రూపాయలు జరిమానా విధిస్తారు. వాహనాన్ని అత్యంత వేగంగా నడిపితే సెక్షన్ 184 కింద ఆరు నెలలు నుంచి ఏడాది వరకు జైలు శిక్ష లేదా ఐదు వేల రూపాయల వరకు జరిమానా విధిస్తారు. సెక్షన్ 279 కింద వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తారు. ఇవి సాధారణంగా పోలీసులు నమోదు చేసే కేసులు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై టౌన్ న్యూసెన్సు యాక్టు కింద కేసులు నమోదు చేసి పెట్టీ కేసులుగా జరిమానాలు విధిస్తూ ఉంటారు. బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ ముందు వీరిని హాజరుపరుస్తుంటారు. అయితే కొద్ది నెలల నుంచి బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ లేక పోవడంతో ఏలూరు నగరంలోని కొన్ని పోలీస్ స్టేషన్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. సాధారణంగా ప్రతి రోజు పోలీసులు వాహనాలు తనిఖీ చేసినప్పుడు సాయంత్రానికి సంబంధిత డీఎస్పీ కార్యాలయానికి డైలీ స్విచ్ వేషన్ రిపోర్టు (డీఎస్ ఆర్) తెలుపుతారు. ఆ రోజు ఆ స్టేషన్‌లో ఎన్ని కేసులు నమోదు చేశారు, ఏప కేసులు వంటి వివరాలు తెలుపుతారు. స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు ఎన్ని నమోదయ్యాయి, పెట్టీ కేసులు ఎన్ని, డ్రంకెన్‌డ్రైవ్ కేసుల ఎన్ని నమోదయ్యాయన్న వివరాలు నివేదిస్తారు. డ్రంకెన్ డ్రైవ్ చట్టంలో మార్పు తీసుకొచ్చిన తర్వాత మద్యం తాగి వాహనం నడిపితే బ్రీత్ ఎనలైజర్‌లో వాహనం చిక్కితే పది వేల వరకూ జరిమానా విధిస్తున్నారు. ఇటీవల కొన్ని పోలీస్ స్టేషన్లలో ఈ కేసులను పట్టుకుని ఇన్‌చార్జిగా ఉన్న పర్మినెంట్ కోర్టుల మెజిస్ట్రేట్ ముందు హాజ రుపర్చడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కిన వాహనాన్ని స్టేషన్‌కు అనధికారికంగా తరలిస్తున్నారు. బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ లేకపోవడంతో ఇదే అదనుగా తీసు కున్న పోలీస్ స్టేషన్ల లోని రైటర్ సంబంధిత ఎస్‌హెచ్‌వోలు కలిసి అక్కడికక్కడే ఆ కేసును వారే పరిష్కరిస్తూ జరిమానాలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి కోర్టు జరిమానా విధిస్తేనే చెల్లించాలి. కొన్ని స్టేషన్లలో పెట్టీ రిజిస్టర్‌లు నమోదు చేసినా డీఎస్ ఆర్ చెప్పేటప్పుడు కొన్ని కేసులు తగ్గిస్తున్నారని, నెల వారీ డీసీఆర్‌బీకి ఇచ్చే లెక్కల్లో కేసులు తగ్గిస్తున్నట్టు తెలుస్తోంది. స్టేషన్‌లోని పెట్టి రిజిస్టర్‌లో నమోదైన కేసులకు, నెలవారీ డీసీ ఆర్ బీకి ఇచ్చే కేసులకు పొంతన లేనట్టే తెలుస్తోంది. గుట్టు చప్పుడు కాకుండా మద్యం కేసులో పట్టుబడ్డ వారి నుంచి రూ.16 వేల వరకు పోలీస్ స్టేషన్లలో వసూలు చేసి ఆపై బండి ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఇక బహిరంగ ప్రదేశంలో మద్యం తాగి పట్టుబడ్డవారికి సాధారణంగా బెంచ్ కోర్టులో హాజరుపరిస్తే రూ.200 వరకు జరిమానా విధిస్తారు. వీటిలో కూడా కొన్ని స్టేషన్లలో రూ.500 నుం చి రెండు వేల వరకు వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కొన్ని స్టేషన్లలో సిబ్బంది, అధికారులు మారడం తో అప్పట్లో వసూలు చేసిన ఈ సొమ్ము వారే ఖర్చు పెట్టేశారనని స్టేషన్లలో చెప్పుకోవడం గమనార్హం. కొన్ని కేసుల్లో ఏకంగా కోర్టు కానిస్టేబుళ్లే మేజిస్ట్రేట్‌ల అవతారం ఎత్తి రైటర్‌లకు ఇంత సొమ్ము వసూలు చేయాలంటూ ఆదేశాలు ఇస్తున్నట్టు సమాచారం. ఒక పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నమోదు లేకపోయినా ఈ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, తనిఖీలు నిర్వహిస్తూ గుట్టుచప్పుడు కాకుండా స్టేషన్‌లోనే పరిష్కరిస్తు న్నట్టు సమాచారం. ఆ స్టేషన్‌లో పెట్టీ కేసుల రిజిస్టర్‌లో నమోదైన కేసులకు కోర్టు వరకు వెళ్లిన కేసులకు పొంతనే ఉండదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉన్నతాధికారులు డ్రంకెన్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి వాస్తవా లను వెలికి తీయాల్సి ఉంది. ఏలూరు నగరంలో 600 కేసులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

చలో విజయవాడ వాయిదా

స్పష్టత రాకుండా ఎలా వాయిదా వేస్తారు

యూటీఎఫ్ వ్యతిరేకత

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.23 వేల కోట్ల బకాయిలకు నిధులు విడుదల చేయాలంటూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ ర్యాలీ, బహిరంగ సభలను వాయిదా వేస్తున్నట్టు జేఏసీ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో పలు అంశాలపై సానుకూల వాతావరణం వ్యక్తమైందని, బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం మినిట్స్‌ను కూడా విడుదల చేయడంతో పాటు, త్వరలో మధ్యంతర భృతి (ఐఆర్)పైనా నిర్ణయం వెలువడే సంకేతాలు వచ్చాయని వివరించారు. ఈ క్రమంలో చలో విజయవాడ ఆందోళనను తాత్కాలికంగా వాయిదావేసి దాని స్థానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోలీసులు అందజేసిన నోటీసులకు వ్యతిరేకంగా ఈ నెల 27న జిల్లాస్థాయిలో ఎన్జీవోలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని రాష్ట్రనాయకత్వం పిలుపు నిచ్చింద న్నారు. అయితే బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే ఉద్యమాన్ని ఎలా వాయిదా వేస్తారని జేఏసీ రాష్ట్ర నాయకుల నిర్ణ యాన్ని ప్రదాన ఉపాధ్యాయ సంఘమైన యూటీఎఫ్ జిల్లా నాయకులు ఆక్షేపిం చారు. మరోవైపు చలో విజయవాడ ఆందోళను జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులెవ్వరూ హాజరుకాకుండా నిలువరించేందుకు పోలీసుశాఖ అందుబాటులో వున్న అన్ని ముందస్తు చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం నుంచే జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని ఉద్యోగ సంఘాల నాయకులకు పోలీసులు నోటీసులు అందజేయడంతో పాటు, మరికొందరి కదలికలపైనా సునిశిత నిఘా పెట్టారు. చలో విజయవాడకు పోలీసుల అనుమతిలేనందున జిల్లా నుంచి ఎవరూ హాజరు కావద్దని పేర్కొంటూ నోటీసులు ఇవ్వడంతో పాటు ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకుల ఇళ్ళవద్ద, కార్యాలయాల వద్ద నోటీసులు అందజేశారు. జేఏసీ నిర్ణయాన్ని యూటీఎఫ్ జిల్లా నాయకులు రవికుమార్, నరసింహారావు తదితరులు వ్యతిరేకించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత సాధించకుండానే చలో విజయవాడ పిలుపును వాయిదా వేసి ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఇంటెరిం రిలీఫ్ ఇవ్వకుండా పీఆర్సీని అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పడం బూటకమని ధ్వజమెత్తారు. ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకుండానే ఉద్యమాన్ని అర్ధంతరంగా వాయిదా వేశారని, పోరాటాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.



ఐక్యత చాటుతున్న నాయకులు

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను ఆదుకోవాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: వెలుగును పంచే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లకు ప్రభుత్వ విధానాల కారణంగా అంధకారంలో మగ్గుతున్నారని, భవననిర్మాణ రంగంలో సరైన సదుపాయాలు లేక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లు వీధిన పడుతున్నారని వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బొజ్జా రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అధ్యక్షతన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన వతూఉతూ భవన నిర్మాణ రంగంలో ఉన్న అనేక సదుపాయాలు ఇప్పుడు లేవన్నారు. ఒక ప్రమాదం జరిగితే రూ.2 లక్షలు, చనిపోతే రూ.5 లక్షలు, కుటుంబసభ్యులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారని జగన్ ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పథకం అందడం లేదన్నారు. సంక్షేమబోర్డును సైతం తీసివేశారని, దీని ద్వారా భవననిర్మాణ కార్మికులను జగన్ నట్టేట ముంచారని విమర్శించారు. వసూలు చేస్తున్న సెస్ ఎక్కడికి పోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికశాఖ మంత్రి కనీసం సమస్యలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో పట్టించుకోకుంటే తమ సత్తా చాటుతామని రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల యాభై వేల మంది ఉన్నారని తెలిపారు. కార్మికశాఖ క్లైములు విడుదల చేయాలని, చెస్ నిలుపుదల చేసి ప్రభుత్వమే టూల్ కిట్‌లు ఇవ్వాలని, మెప్మా ద్వారా రుణాలు మంజూరు, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. క్లైయిములు పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యక్షుడు టి.తారక్‌నాథ్, బి.శ్రీనివాసరావు, కె.రాజకుమార్, ఎం.శ్రీనివాసరావు, ఎన్.గంగాధరం, డాల్ఫిన్, కె.అశోక్‌కుమార్, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, చిట్టిబాబు, వివిధ జిల్లాల నుంచి ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

పారామెడికల్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు డిమాండ్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 : వైద్య ఆరోగ్యశాఖలో డీఎస్సీ-2002 నోటిఫికేషన్ ద్వారా 2003లో కాంట్రాక్టు విధానంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికన నియమితులైన 104 మంది పారామెడికల్ హెల్త్ అసిస్టెంట్స్ (పురుషులు) ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించడంలో అధికారుల అవగాహనా రాహిత్యం వల్ల అన్యాయానికి గురవుతున్నారని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఎన్.రాజు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇటువంటి ఉద్యోగులు రాష్ట్రంలో సుమారు 900 మంది ఉన్నారని, క్లియర్ వేకెన్సీలు, శాంక్షన్డ్ పోస్టుల్లో వీరంతా పనిచేస్తున్నారని తక్షణమే వీరి సర్వీసులను రెగ్యులరైజ్ చేసేందుకు వీలుగా 'నిధి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి అర్హులైనవారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎక్కడుందో ? ఏమైందో ?

అదృశ్యమై ఐదు నెలలు.. నేటికి చిక్కని ఆచూకీ

కుమార్తె కోసం ఓ తండ్రి ఆందోళన



అదృశ్యమైన యువతి కీర్తి



పూజల పేరుతో మోసం చేసిన ఉపేంద్ర

నరసాపురం/యలమంచిలి ఫిబ్రవరి 25: మీ ఇంట్లో దోషాలున్నాయి... వాటిని పూజలతో సరి చేస్తా.. కళ్ల సరిగ్గా కనిపించని యువకుడికి మూడు నెలల్లో మామూలుగా చూపు రప్పిస్తా... ఇందుకు రూ.20 వేలు ఇవ్వండి. అంటూ నమ్మబలికి ఆ కుటుంబాన్ని నట్టేట ముంచడమే కాకుండా పెళ్లీడి కొచ్చిన కుమార్తెను మాయమాటలతో ఎత్తు కెల్లాడు. ఐదునెలల గడిచినా నిందితుడి ఆచూకీ గాని అదృశ్యమైన యువతి ఆచూకీ కాని చిక్కలేదు. ఈ సంఘటన యలమంచిలి మండలం బాడవలో చోటు చేసుకుంది. కుమార్తె తండ్రి దేవరపు సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ప్రకారం మొదటి కుమార్తె కుమారుడికి చూపు సరిగ్గా కనిపించడం లేదు. గతేడాది సెప్టెంబరులో జోతిష్యం పేరుతో పచ్చకాయల ఉపేంద్ర (32) గ్రామంలోని సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులకు మీ ఇంటికి దోషం ఉంది.. అందుకే అబ్బాయికి చూపు సరిగ్గా కనిపించడం లేదు.. పూజలు చేసి మంచి స్థితిని కల్పిస్తానని నమ్మించాడు. ఇందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. అంత స్తోమత లేదని చెప్పడంతో చివరికి రూ.20 వేలకు ఒప్పుకున్నాడు, మూడు నెలల పాటు తరుచూ ఇంటికి వచ్చి పూజలు చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబరు 29న సుబ్రహ్మణ్యం చిన్న కుమార్తె కీర్తి (22) కనిపించలేదు. రాత్రివరకు ఇంట్లో ఉన్న కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు యలమంచిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఉపేంద్రతో తరుచూ ఫోన్ మాట్లాడు తున్నట్లు గుర్తించారు. అయితే నంబరు వేరే పేరుపై ఉంది.అతను గల్ఫ్‌లో ఉన్నట్లు తెలింది. ఆ వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు యువతిని కిడ్నాప్ చేసిన వ్యక్తిది కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండ గ్రామంగా తేలింది. అతని సోదరుడిని పట్టుకుని విచారించగా ఉపేంద్రకు ముందుగానే పెళ్లి అయి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తేసింది. భార్యను విచారించగా కొంతమంది కుటుంబ సభ్యులు వివరాలిచ్చింది.ఆ దిశగా పోలీసులు భద్రాచలం, కరీంనగర్, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో దర్యాప్తు చేశారు. నిందితుడు, కిడ్నాప్‌కు గురైన యువతి దగ్గర ఫోన్‌లు కూడా లేకపోవడంతో కనీసం ఆచూకీ చిక్కలేదు. దీంతో కుమార్తె తండ్రి జిల్లా పోలీసులతో పాటు సీఎం కార్యాలయంలో కూడా సంప్రదించారు. ఇంత వరకు ఎటువంటి ఆధారాలు చిక్కలేదు. ఈ కేసుపై యలమంచిలి ఎస్ఐ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నిందితుడిని పట్టుకునేందుకు ఆంధ్ర, తెలంగాణలోని చాలా పోలీస్ స్టేషన్‌లకు సమాచారం ఇచ్చామన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.



భీమవరం ఆదిత్య డిగ్రీ కాలేజీలో గ్రూప్-2 పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు



ఏలూరులో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థి



ఏలూరులో రూమ్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

గ్రూప్-2 ప్రశాంతం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రూప్ -2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సమయానికి గంటముందే అభ్యర్థులు కేంద్రాలకు వచ్చారు. హాల్‌టిక్కెట్, గుర్తింపు కార్డు పరిశీలన, తనిఖీల తర్వాత కేంద్రంలోకి అనుమతించారు. ఏలూరులో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ పరిశీలించారు. భీమవరంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



వట్లూరు సీఆర్ రెడ్డి కళాశాల వద్ద..



ఏలూరులో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరులో 83.67 శాతం, పశ్చిమలో 84.80 శాతం హాజరు

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 : జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రీలిమినరీ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 37 పరీక్షా కేంద్రాల్లో 14,546 మందికి అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 12,336 (84.80 శాతం) హాజరయ్యారని, 2,210 హజరు కాలేదన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షలు పూర్తయ్యేవరకు ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించిన ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి శివనారాయణరెడ్డిని, పరీక్షల నిర్వహణలో తోడ్పాటును అందించిన ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి జయంతి, ఏఎస్‌వోఏ నాగలక్ష్మీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి పీహెచ్‌జీఆర్ పాపారావు, పర్యవేక్షకులు ప్రసాద్, సిబ్బంది, తదితరులను జేసీ అభినందించారు. పట్టణంలోని శ్రీవిష్ణు కాలేజీ పరీక్షా కేంద్రంలో జేసీ పరిశీలించారు. పరీక్షా పేపర్లు స్ట్రాంగ్ రూమ్‌కి చేరేవరకు వాహనాలకు పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు.

నరసాపురం టౌన్ : పట్టణ, మండలంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. వైఎన్ కళాశాల, సూర్య మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్షలు జరిగాయి. అన్ని కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తణుకు : తణుకు పట్టణంలో భాష్యం, శశి, బాలురున్నత పాఠశాల, ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల, ఎస్‌సీఐఎం కళాశాలలో పరీక్షలు జరిగాయి. 1,916 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 1,530 మంది హాజరు కాగా, 386 మంది హాజరు కాలేదు.

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 25: ఏలూరు జిల్లాలో 39 పరీక్షాకేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్ -2 పరీక్షలకు 13,977మంది హాజరు కావాల్సి ఉండగా 11,696 మంది (83.68 శాతం) అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 2,281 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, సీఆర్ రెడ్డి ఉమెన్స్ కళాశాలలో పరీక్షాకేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. సీఆర్.రెడ్డి కళాశాల, తదితర కళాశాలల్లో నిర్వహించిన పరీక్షాకేంద్రాలను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పరిశీలించారు.ఆర్డీవో ఖాజావలీ, ఎఫ్‌పిఐఎసీ జోనల్ మేనేజరు కె.బాబ్జి తదితరులు ఉన్నారు.



నరసాపురంలో పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

పెదపాడు :పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్, సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఇంజనీరింగ్ కళాశాలలో 1822 మంది హాజరు కాగా 178 గైర్హాజరయ్యారు. మహిళా కళాశాలలో 362 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు.

ఏలూరు క్రైం : ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిలు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా ఇంటర్ క్యాంపస్ సెంటర్, సీఆర్‌రెడ్డి కళాశాల, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు.

ఆకట్టుకున్న చిత్రకళా సంబరం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 : భీమవరంలో అంకాల ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్రకళా సంబరం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 87 మంది చిత్రకారులు పాల్గొని చిత్రాలు వేశారు. ఆదివారం ఉదయం ఆనంద గ్రూపు కంపెనీకి చెందిన వదరాజు ముత్తరాజు ఆనంద్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. 60 ఏళ్లుగా అకాడమీ చేస్తున్న కళా సేవలను ప్రశంసించారు. దాతల సహకారంతో ఈ భవనాన్ని నిర్మిం చారని ప్రతి ఆదివారం చిన్నారులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రముఖ చిత్రకారుడు ముర్గపూడి ఉదయ కుమార్ (పాలకొల్లు)ను ఘనంగా సత్కరించారు. అదే విధంగా 87 మంది చిత్రకాలను ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రముఖ జర్నలిస్టు అబ్దుల్ రజా హస్సేన్, అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి వెంకటరావు, కాగిత వెంకట రమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, చెరుకువాడ రంగసాయి, మెంటే పార్థసారధి, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఒక చేప, దాని నడుం పైనుంచి త్రిశూలం.. కోడి కత్తులు.. త్రిశూలం మధ్యలో ఇంజక్షన్.. దీని అర్థం ఏమిటంటే ఆక్వా రాజధాని, ఇక్కడ పంచారామ క్షేత్రం, కోడి పందాలు, కలరా వంటి వ్యాధికి ముందు కనిపెట్టిన ఎల్లాప్రగడ సుబ్బారావు పుట్టిన గడ్డ అని అర్థం వచ్చేలా చిత్రీకరించాడు. మావుళ్ళమ్మను ఆరాధన, పల్లెటూరి వాతావరణం, పంచారామ క్షేత్ర మహాశివుడి ఆహార్యం, ప్రకృతి చిత్రాలు ఇలా పలు చిత్రాలు చూపరులను కట్టిపడేశాయి..



మావుళ్లమ్మ ఆరాధన





పల్లె అందాలు



భీమవరం ముఖచిత్రం



సోమేశ్వరుడు



చిన్ననాటి ఆనందాలు



ఎంపీ రఘురామకృష్ణంరాజును కలిసిన శెట్టిబలిజ సంఘం నాయకులు

తెలంగాణలో శెట్టి బలిజలకు బీసీ హోదా

ఎంపీని కలిసిన బీసీ నాయకులు

భీమవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో బీసీ హోదా కోల్పోయిన శెట్టి బలిజలకు న్యాయం చేయాలని బీసీ నాయకులు నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం సమర్పించారు. బీసీ హోదాను కోల్పోవడంతో జరిగే కష్టనష్టాలను ఎంపి దృష్టికి తీసుకువెళ్లారు. తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గుత్తుల మీరాకుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఢిల్లీలో ఎంపీని కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శెట్టి బలిజలకు బీసీ హోదాకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని తెలిపారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, కెఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి నాగేంద్ర, గుబ్బల బాబ్జి, సానబోయిన వెంకటేశ్వరరావు, పిల్లి నాగగోపాల్, మల్లుల శ్రీనివాస్, శోభన్ కుమార్ తదితరులు ఎంపీని కలిశారు.



గుర్రపు డెక్కతో నిండిపోయిన మురుగు కాలువ

ఈ వేసవికైనా చేస్తారా !

ఆచంట, ఫిబ్రవరి 25: ఆచంట మండలంలో ఉన్న నక్కల కాల్వ, కొరాలపర్రు, జగ్గరాజు కాలువ మురుగు డ్రెయిన్లు అనేక చోట్ల గుర్రపు డెక్కతో నిండిపోయాయి.దీంతో నీటి ప్రవాహానికి అటంకం ఏర్పడుతుంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. మురుగు కాలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఉన్నప్పటికి గుర్రపుడెక్క తొలగింపునకు తూతూ మంత్రంగా మందు స్ప్రేచేసి చేతులు దులుపుకుంటున్నారు. రానున్న వేసవి కాలంలో అయినా మురుగు కాలువలను పూర్తిస్థాయిలో బాగు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో యువకుని ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25 : మద్యానికి బానిసై అనారోగ్యానికి పాలైన ఒక యువకుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాలు ప్రకారం పెదవేగి మండలం పినకడిమి గ్రామానికి చెందిన కడమంచి వినయ్‌బాబు (24)కు తల్లి దండ్రులు లేరు. అతని బంధువులు వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన అతను గతంలో ఏడాది క్రితం తనపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకున్నాడు. మళ్ళీ మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. ఆదివారం ఉదయం ఏలూరు జూట్‌మిల్లు సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావుకు సమాచారం అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ట్రాక్టర్ ఢీకొని విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతి

ఉంగుటూరు, ఫిబ్రవరి 25 : ఉంగుటూరు మండలం నాచుగుంట-కాగుపాడు రోడ్డులో ఆదివారం ఇటుకల ట్రాక్టర్ ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఉంగుటూరుకు చెందిన అంపా భాస్కరరావు (65) అనే వృద్ధుడు మృతి చెందినట్టు చేబ్రోలు ఎస్ఐ .మణి కుమార్ తెలిపారు. దీనిపై కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

చెరుకువాడలో గుర్తు తెలియని మృతదేహం

ఉండి, ఫిబ్రవరి 25: చెరుకువాడ పంటకాలువలో గుర్తు తెలియని మృత దేహం గుర్తించినట్లు ఉండి హెడ్ కానిస్టేబుల్ యేషయా తెలిపారు. ఉండి మండలం చెరుకువాడ పంటకాలువ సమీపంలోని కోనాలపల్లి స్లూయిజ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం వున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి వెంకట ప్రసాదు ఇచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 35-40 సంవత్సరాలు మధ్య వయుసు గల మగ వ్యక్తి అని, నలుపురంగు ప్యాంటు ధరించి, ఫుల్ హ్యాండ్ షర్టు ధరించి తెలుపు షర్టుపై నలుపు చారలున్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తించినట్లుయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోదరి గృహ ప్రవేశానికి వెళుతుండగా ప్రమాదం

హైదరాబాద్ సమీపంలో గుమ్మలూరు యువకుడి మృతి



పోడూరు, ఫిబ్రవరి, 25 హైదరాబాదులో ఉంటున్న అక్క గృహ ప్రవే శానికి వెళ్తూ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన హైదరాబాదు శివారులో శనివారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోడూరు మండలం గుమ్మలూరు గ్రామానికి చెందిన యువకుడు కోన లోకేష్ (25) అక్క హైదరాబాదులో ఉంటుంది. కొత్తగా ఇంటిని నిర్మించుకోవడంతో ఆది వారం జరిగే గృహ ప్రవేశానికి లోకేష్ హైదరాబాదు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. హైదరాబాదు చేరుకునే క్రమంలో శివారు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సెల్‌ఫోన్ ఆధారంగా అక్కడి పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ నడుపుతూ కుటుం బానికి సహాయంగా ఉంటున్న ఇతని దుర్మరణంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



ఎక్స్‌కవేటర్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

ఏలూరులో ఇల్లు ధ్వంసం..కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25 : ఒక కుటుంబం నివాసం ఉంటున్న ఇంటిని ఎక్స్ కవేటర్‌తో ధ్వంసం చేయించిన వ్యక్తితో పాటు మరికొందరిపై ఏలూరు వన్‌టౌన్‌లో పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు కనకదుర్గమ్మ దేవాలయం (రామకోటి) సమీపంలో నివాసం ఉంటున్న వెంకట లక్ష్మి ఇంటిని ఏలూరు గ్రీన్‌సిటీలో నివాసం ఉంటున్న ఠాగూర్ నిరంజన్‌సింగ్, మరికొంత మంది వచ్చి దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్‌తో ఇంటిని ధ్వంసం చేశారని ఆ సమయంలో తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారని వెంకటలక్ష్మి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు టీడీపీలో చేరనున్న సారథి బృందం

నూజివీడు, ఫిబ్రవరి 25: పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే కొలు సు పార్థసారథి సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడు సమక్షంలో తన అనుచరులతో ఆ పార్టీలో చేరనున్నారు. తన కార్యాలయం నుంచి భారీ కాన్వాయ్‌తో మంగళగిరి పార్టీ కార్యాలయం చేరుకుం టారు. అక్కడ తన అనుచరులైన విజయవాడ వైసీపీ టౌన్ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఇటీవలే వైసీపీలో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన చంద్రశేఖర్‌తో కలసి ఆయన టీడీపీలో చేరనున్నారు. ఇప్పటికే సారథికి నూజివీడు టీడీపీ అభ్యర్థిగా టిక్కెట్ కేటాయించిన విషయం తెలిసిందే. మంగళవారం నూజివీడు రానున్న పార్థసారథి నూజివీడు మండలం సీతారాంపురం గ్రామం వద్ద నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నూజివీడు టౌన్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో సారథి నూజివీడు మండలంలోని పలు గ్రామాల గుండా ప్రయాణించి నూజివీడు పట్టణం ద్వారా ఆగిరిపల్లి మండలం చేరుకుంటారు. సాయంత్రం ఆగిరిపల్లిలో భారీ సభలో ఆయన ప్రసంగిస్తారు. కార్యక్రమాన్ని భారీ ఎత్తున జరిపేందుకు టీడీపీ యంత్రాంగం సమాయత్తం అవుతోంది.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 25: నూజివీడు ట్రిపుల్ ఐటీ రోడ్డులో సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో శుక్రవారం సైకిలిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఆసుపత్రికి తరలించగా శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు తెలిస్తే 89779 17599 నంబరుకు సమాచారం ఇవ్వాలని నూజివీడు పట్టణ సీఐ మూర్తి తెలిపారు.






భీమడోలు మండలం కోడూరుపాడులో గన్ని వీరాంజనేయులు, ఏలూరు శాంతి నగర్‌లో బడేటి చంటి, లింగపాలెం మండలం వేములపల్లిలో రోషన్, పెదపాడు మండలం ఏపూరులో చింతమనేని ప్రభాకర్ ప్రచారం

అభివృద్ధి చూసి గెలిపించండి

గ్రామాల్లో టీడీపీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల ప్రచారం

భీమడోలు, ఫిబ్రవరి 25: టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు కోరారు. కోడూరుపాడులో ఆదివారం రచ్చబండ అనంతరం మన ఇంటికి మన గన్ని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలో పలు కుటుంబ సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి శాలువా కప్పి గన్ని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజ్‌కుమార్ అనే టీడీపీ కార్యకర్త ఆర్థిక సహాయంతో 50 మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. గ్రామ ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు కీలకం : బడేటి

ఏలూరు రూరల్: రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమని, వైసీపీ పాలనకు సమాధికట్టే రీతిలో ప్రజాతీర్పు ఉండాలని టీడీపీ ఏలూరు అభ్యర్థి బడేటి చంటి అన్నారు. శాంతినగర్ ఐదో రోడ్డులో ఆయన ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరిని కలుసుకుని టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజా కంటక పాలనకు ప్రజలు విజ్ఞతతో తీర్పు ఇవ్వాలని కోరారు. ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, ఎ.రామకృష్ణ, కేతినీడి భాస్కరరావు, కె.కిషోర్, వి.బాబురావు, చిట్టూరి శ్రీనివాస్, ఎ.రమేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన విజయం ఖాయం : చింతమనేని

పెదపాడు: రానున్న రెండు నెలల్లో నియంత పాలన పోయి టీడీపీ, జనసేన కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏపూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం జరిగింది. చింతమనేని మాట్లాడుతూ అక్రమార్జన లక్ష్యంగా అధికారం చేపట్టిన జగన్‌రెడ్డి రాష్ట్రంలోని సహజ వనరులను కొల్లగొట్టి, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలతో, మద్యం అమ్మకాలతో, అధిక ధరలతో పేదవాడి జేబుకు చిల్లుపెట్టి నిలువునా దోపిడి చేశారన్నారు. చంద్రన్న ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు అన్ని విధాలుగా అండా ఉంటామన్నారు. మహిళలంతా టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలవాలని చింతమనేని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వరం : రోషన్

లింగపాలెం: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వరమని టీడీపీ చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. వేములపల్లిలో గరిమెళ్ళ చలపతిరావు, పాతూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మేనిఫెస్టో వివరించారు. గ్రామంలో ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. మోరంపూడి మల్లికార్జునరావు, పాతూరి ప్రభాకర్, బలుసు శ్రీను, పాతూరి మురళీ, నత్తా నాగేంద్ర, బాల మాదవరావు, బొల్లిన పుల్లారావు, మోరంపూడి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు బారీగా పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపుదాం

కామవరపుకోట: ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దింపుదామని సొంగా రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. పాతూరు గ్రామంలోని ఘంటా మురళీ నివాసం వద్ద నాయకులు, కార్యకర్తలతో ప్రచారం చేద్దాం, ఎన్నికలపై చర్చించారు. ఘంటా సుధీర్, ఖాన్ వజీర్, జనసేన మండల కన్వీనర్ షేక్ వలీ తదితరులు ఉన్నారు.

● జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పరిచయ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పట్టణపార్టీ అధ్యక్షుడు రావూరి కృష్ణ పిలుపునిచ్చారు. పట్టణ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సోమవారం జరిగే పరిచయ కార్యక్రమంలో స్థానిక సమస్యలు, విజయం చేకూర్చే దిశగా కార్యాచరణపై కార్యకర్తలు, నాయకులతో చర్చ జరుగుతుందన్నారు. సమావేశంలో తూటికుంట రాము, పెనుమర్తి రాంకుమార్, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, చేను ప్రసాద్, అల్లూరి రామకృష్ణ, గుమ్మడి ప్రసాద్, గుళ్లపూడి శ్రీదేవి, రమేష్, శీలం గోపి, పగడం దినేష్, నాయుడు శ్రీను, శీలం రాంబాబు, పితాని నాగు, పిచుపాటి అబిరం, కంచర్ల గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

క్రైస్తవులను మోసం చేసిన జగన్



మాట్లాడుతున్న టీడీపీ క్రైస్తవ విభాగం నేతలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో క్రైస్తవులు, పాస్టర్లను సీఎం జగన్మోహన్ రెడ్డి మోసం చేశారని, టీడీపీ క్రైస్తవ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో తల్లి విజయమ్మ, బ్రదర్ అనిల్‌తో క్రైస్తవులను ఆదుకుంటామని, మేలు చేస్తామని ప్రచారం చేయించుకుని లబ్ధిపొందారన్నారు. తరువాత క్రైస్తవుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఒక్క సంక్షేమ పథకం అమలు చేసిన పాపాన పోలేదన్నారు. తాజాగా జగన్ మేనత్త విమలా రెడ్డిని రంగంలో దింపి మరోసారి క్రైస్తవులను, పాస్టర్లను మోసం చేసే ప్రక్రియ ప్రారంభించారన్నారు. వారి మాటలకు క్రైస్తవులు ఎవరూ మోసపోరని తెలిపారు. జగన్ కనీసం క్రిస్మస్ కానుక కూడా అందించలేదని విమర్శించారు. విదేశీవిద్య కేవలం ఉన్నతవర్గాలకేనని, ఒక్క క్రిస్టియన్ విద్యార్థికైనా విదేశీవిద్య అందించారా సబ్సిడీ రుణాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. జగన్ మోసపూరిత హామీలు ప్రస్తుతం క్రైస్తవులు, పాస్టర్లు నమ్మే స్థితిలో లేరని, ఎన్నికల్లో వారి సత్తా చూపెడతారన్నారు. జగన్ సొంత జిల్లా కడపలో అంతర్జాతీయ సువార్తికులు టి.ప్రసన్నకుమార్ ఆస్తులను సైతం జగన్మోహన్‌రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. సమావేశంలో పాలి ప్రసాద్, క్రిస్టియన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మోజేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సందర్శనతో విజ్ఞానం



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఫిబ్రవరి 25: గ్రంథాలయ సందర్శనతో విజ్ఞానం పెరుగుతుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి గ్రంథపఠనం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల గ్రంథ పఠనంపై విద్యార్థుల్లో అవగాహన లోపించిందన్నారు. సృజనాత్మకతను పెంచే గ్రంథాలను చదవడంద్వారా విజ్ఞానం మరింతగా పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంధపఠనం చేయాలని, జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సంతాన వేణుగోపాలస్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 25: తూర్పువీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్ల ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం దంపత తాంబూలాలు, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం రామానుజాచార్యులు బృందం భక్తులతో పూజలు చేయించారు.

రామకోటిలో నవ బాలల పూజ

ఏలూరు అగ్రహారంలోని రామకోటి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నవ బాలల పూజ, బాల గణపతి పూజ, నవదుర్గల పూజ నిర్వహించారు. 310 మంది మహిళలు లలిత సహస్రనామ కుంకుమార్చన చేశారు. రామకోటి ఉత్సవ కమిటీ కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, వేమా వి.సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, పాదర్తి బాలకృష్ణ భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా వీరభద్రేశ్వరుని రథోత్సవం



కామవరపుకోటలో రథోత్సవం

కామవరపుకోట, ఫిబ్రవరి 25: స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద మంత్రోచ్ఛరణలతో ప్రధాన కూడళ్లలో స్వామివారి దర్శనం ఇచ్చారు. గ్రామంలోని వ్యాపార వాణిజ్య దుకాణాలు మూసివేసి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అర్చకులు మేడూరి ప్రసాద్, రంగబాబు, భాస్కరరావు, భక్తులతో పూజలు జరిపించారు. ఆర్యవైశ్య సంఘం, కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు

దెందులూరు, ఫిబ్రవరి 25: గాలాయగూడెం అచ్చమ్మ పేరం టాలమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో ఉదయం నుంచి సాయం త్రం వరకూ వేలాది మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం అన్నదానం జరిగింది. వేలాది మంది అచ్చమ్మ పేరంటలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కైకరంలో వేణుగోపాలస్వామి ఊరేగింపు

ఉంగుటూరు, ఫిబ్రవరి 25: కైకరం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను ట్రాక్టర్‌పై ఊరేగించారు. అర్చకులు కిరణ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు నిర్వహించి పురవీధులలో ఊరేగించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఫిబ్రవరి 25: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన పాలపొంగలి నైవేద్యం సమర్పించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, శేష గిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.38,300, లడ్డుప్రసాదాల విక్రయాల ద్వారా రూ.12,500, ఫోటో విక్రయాల ద్వారా రూ.2125 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.11,597 విరాళాలు అందించారని ఆయన చెప్పారు.

టీడీపీ, జనసేన సభను జయప్రదం చేయాలి



జనసేన కార్యాలయంలో మాట్లాడుతున్న ధర్మరాజు, నేతలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 25: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న జరిగే సభలో సార్వత్రిక ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టోను చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేస్తారని, సభను జయప్రదం చేస్తారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం నాడు ఉంగుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 20 వేల కార్యకర్తలను తరలించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వాహనానికి తెలుగుదేశం, జనసేన జెండాలు ఏర్పాటు చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పాతూరి విజయకుమార్, చింతల శ్రీనివాస్, కరణం పెద్దిరాజు, సూరత్తుల అయ్యప్ప, వంగా రఘు, మారిశెట్టి ప్రసాద్, బండారు మధు, చింతలపాటి భాస్కరరాజు పాల్గొన్నారు.

అనంతరం జనసేన నియోజకవర్గ కార్యాలయంలో పత్సమట్ల ధర్మరాజు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వీర మహిళలు, జనసేన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఉంగుటూరు జనసేన కార్యాలయం నుంచి తాడేపల్లిగూడెంలో సభా ప్రాంగణానికి ర్యాలీగా తరలి రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

● పెదవేగి: తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడులో నిర్వహించనున్న టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెప్పారు. ఈ నెల 28న ప్రత్తిపాడులో జరుగనున్న టీడీపీ, జనసేన రాష్ట్రస్థాయి ఉమ్మడి బహిరంగ సభ విజయవంతం చేయాలని దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకుని, ప్రతి కార్యకర్త ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్నారు. రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాదు రవికుమార్, పరసా వెంకట్రావు, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, మోరు శ్రావణి, గారపాటి రామసీత, కొనకళ్ళ శివమణి, నేతల రవి, ముప్పిడి చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

పెదపాడు, ఫిబ్రవరి 25: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. గండిచెరువుగట్టు వద్ద ఆదివారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ ఏవిధమైన ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పార్టీల పేరుతో శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు, డిక్షనరీలు



ఉపకార వేతనాలు, డిక్షనరీల పంపిణీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25: ఇంటర్మీడియట్ (2022-23) పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పేద కుటుంబాల బాల బాలికలకు ప్రోత్సాహకాలు అందజేశారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సెబ్ ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఉపకార వేతనాలు, డిక్షనరీలను బహూకరించారు. కాపు అనుబంధ కులాల ఐక్యతకు నూతన వధూవరుల పరిచయ వేదిక, పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, స్కాలర్‌షిప్‌లు అందజేత, రిటైరైన వారిని సత్కరించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాదరావు, సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్ మాట్లాడారు. తొలుత సంఘ భవన దాత వరికూటి పెద గాలియ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు పటగర్ల నాగభూషణం, జెట్టి సింహాద్రిరావు, ఉమా మహేశ్వరరావు, సత్యనారాయణ, పులి కుమార్‌రాజా, రామాంజనేయులు, కనక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 25: దూరవిద్య విద్యార్థులకు కుక్కునూరు జడ్పీ హైస్కూల్‌లోనే పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ నేతలు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుక్కునూరు, వేలేరుపాడులో దూర విద్యార్థులకు 150 కి.మీ దూరంలో జంగారెడ్డిగూడెం పరీక్ష కేంద్రం ఇబ్బందికరంగా ఉందన్నారు. రోజుకు రూ.700 ఖర్చు పెట్టి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుక్కునూరులో సెంటర్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: హేలాపురి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురికి కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కేబీ.రావు, సెక్రటరి బి.సత్యనారాయణ, కోశాధికారి రమాదేవి, ప్రోగ్రామ్ చైర్మన్ రావి పద్మకుమారి ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అందజేశారు. వివిధ కారణాలతో కాళ్లు పోగొట్టుకుని ఇబ్బంది పడుతున్న వంద మంది దివ్యాంగులకు ప్రవాసాంధ్రులు కె.హిమబిందు, కె.శ్రీనివాస్‌ప్రసాద్ దంపతుల ఆర్థిక సహకారంతో అందజేశారు. మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రామ్‌గోపాల్, క్లబ్ గవర్నర్ కె.వేణుబాబు, వై.జగన్మోహన్‌రావు, వి.మురళీమోహన్‌రావు, ఎల్.వెంకటేశ్వరరావు, డి.గణేష్‌బాబు, హేమసుందర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బుద్ధ బోధి అవార్డుల ప్రదానం



ఐజీని సత్కరిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: న్యూమాంక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జీవీ.రాఘవ ఆధ్వర్యంలో 13వ బుద్ధబోధి అవార్డులు ఆదివారం అందజేశారు. 40మంది దంపతులకు బుద్ధబోధి అవార్డులను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అందజేశారు. రిటైర్డ్ ఎస్పీ కె.రాజాశిఖామణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యూమాంక్ ఆఫ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు, సినీనటుడు వీకే.నరేష్, రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణి, కుమార్ చైతన్య, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పార్కు ప్రారంభం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: స్థానిక వసంతమహల్ సెంటర్‌వద్ద నున్న పొట్టి శ్రీరాములు పార్క్ ఎమ్మెల్యే ఆళ్ళ నాని ఆదివారం ప్రారంభించారు. నగరంలో ఆర్యవైశ్యుల కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఎంఆర్.పెదబాబు, ఈదా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, మోటమర్రి సదానందకుమార్, సున్న శ్రీనివాసరావు, చెక్కా రాజా, వి.ప్రవీణ్, జి.రామచంద్రకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్మికులు

చింతలపూడి, ఫిబ్రవరి 25: వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సమావేశాల్లో రైతాంగ, కార్మిక అనుకూల విధానాలపై నిర్ణయాలు తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, సీఐటీయు నాయకులు ఆర్.వి.సత్యనారాయణ అన్నారు. చింతలపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని రైతు, కార్మిక విధానాలపై అబుదాబిలో వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాల్లో అనుకూల విధానాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం రైతులు, కార్మికులతో నిర్వహించే మోటారు సైకిల్ ర్యాలీ జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాలను విడుదల చేశారు. రైతు సంఘ నాయకులు టి.మాణిక్యాలరావు, షేక్ కాలేషా, రావెళ్ళ రాజారావు, టి.ప్రసాద్, కంచర్ల గురవయ్య, సీఐటీయు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 25: దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. కుక్కునూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇండియా కూటమి పోరాడుతుందన్నారు. గతంలో నరేంద్ర మోదీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల దేశ రాజధానిలో రైతులు నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్నారని, ఈ పోరాటంలో ఇప్పటివరకు ఆరుగురు రైతులు అసువులు బాసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 4న బుట్టాయిగూడెంలో జరిగే సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, అక్కినేని వనజ పాల్గొంటారన్నారు. సమావేశంలో మైసాక్షి వెంకటాచారి, కొన్నె లక్ష్మయ్య, అయితా సురేష్, వరకా శ్యామల, కూరాకుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయి చెల్లించాలి



నిరసన తెలుపుతున్న రైతులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 25: రైతులకు ధాన్యం బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాలిపూడిలో నిరసన వ్యక్తం చేశారు. ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ నినాదాలు చేశారు. తొలుత సొసైటీ సమీపంలోని రామాలయం వద్ద రైతులు, కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జనవరి 20 తరువాత ధాన్యం అమ్మిన రైతులు, కౌలు రైతులు బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాలేదన్నారు. ఖరీఫ్ పంట అప్పులు చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని మరోవైపు రబీకు పెట్టుబడికి చేతిలో చిల్లగవ్వలేక అన్నదాతలు అల్లాడుతున్నారని ప్రభుత్వం స్పందించి బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎం.సుబ్బారావు, డి.బాబురావు, టి.సత్యనారాయణ, ఎం.సత్యగణేష్, ఎం.రంగారావు, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులను ఆదుకోవాలి



మండల సమావేశంలో నాయకులు

చింతలపూడి, ఫిబ్రవరి 25: కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న విశ్వ బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలని మండల నాయకులు విజ్ఞప్తి చేశారు. మార్కెట్ యార్డు ఆవరణలో విశ్వ బ్రాహ్మణుల సంఘ మండల సమావేశం ఆదివారం బి.నాగు అధ్యక్షతన జరిగింది. ఏ ప్రభుత్వం వచ్చినా తమను ఆదుకోవడంలేదని, ఇప్పటికీ ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో బీదరికంలోనే ఉన్నాయన్నారు. సంఘ అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో నాయకులు కె.ప్రసాద్, ఎం.చెన్నకేశవాచారి, గిరిజాల చంద్రశేఖర్, బండికట్ల శ్రీనివాస్, కానూరి వెంకటాచారి, పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

నగరంలో వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్ఐ సాధిక్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 25: నగరంలో పోలీసులు ఆదివారం రాత్రి విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. టూ టౌన్ సీఐ ఎం ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సాధిక్, సిబ్బంది నగరంలోని పలు వాహనాలను తనిఖీ చేసి నెంబర్ ప్లేట్లను పరిశీలించారు. వాహనాలకు సరైన ధృవపత్రాలు లేని వారికి జరిమానాలను విధించారు. ఎస్ఐ సాధిక్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, హెల్మెట్ ధరించాలని, సూచించారు.

ఫుట్‌పాత్‌పై ప్రమాదం..!



ఫుట్‌పాత్‌పై విరిగిపోయిన సిమెంటు ప్లేట్లు

జిల్లా కేంద్రమైన ఏలూరు పట్టణం నుంచి నగర స్థాయికి చేరింది. వసతులు మాత్రం అంతంత మాత్రం. ప్రభుత్వాసుపత్రి వద్ద, ఎదురుగా ఉన్న సెయింట్ థెరిస్సా హైస్కూలు, జూనియర్ కాలేజీ గోడపక్కనే ఉన్న ఫుట్‌పాత్‌లపై సిమెంటు దిమ్మలు విరిగిపోవడంతో నిత్యం ఎవరో ఒకరు డ్రైన్లలో పడిపోతున్నారు. ఆసుపత్రికి ఎంతో మంది వైద్య అవసరాలు నిమిత్తం వస్తూ ఉంటారు. మరికొంత మంది ఫుట్‌పాత్‌లపై నడుచుకుంటూ వెళ్ళేవారు గోతుల్లో పడిపోతున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫుట్‌పాత్ సిమెంట్ దిమ్మలు శిథిలమై ఎంతో కాలం అవుతున్నా ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా నాలుగు సిమెంటు దిమ్మలే వేయలేరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్కూలు ప్రక్కనే విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది.

- ఏలూరు క్రైం

రోడ్డు పక్కన కుళ్లిన వ్యర్థాలు..



రోడ్డు పక్కన పడేసిన కోళ్ల వ్యర్థాలు

లింగపాలెం మండలం బోగోలు, ధర్మాజీగూడెం రహదారిపై ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. ఆర్అండ్‌బి రోడ్డుపక్కనే కోళ్ల వ్యర్థాలను పడేయడంతో మరింత కుళ్లిపోయి దుర్గంధం వస్తోందని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. ధర్మాజీగూడెంలో చికెన్ దుకాణాల్లో వ్యర్థాలను బోగోలు రహదారిలో రోడ్డుపక్కనే పడేస్తున్నారు. వాటిని కుక్కలు రోడ్లపైకి ఈడ్చుకువస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ విస్తరణ అధికారి జేఎం రత్నకుమారిని వివరణ కోరగా పంచాయతీ సిబ్బంది వారానికి ఒకసారి కోళ్ల వ్యర్థాలను శుభ్రం చేస్తున్నారన్నారు. చికెన్ దుకాణ యజమానులకు నోటీసులు అందజేశామన్నారు. రాత్రి వేళ కోళ్లవ్యర్థాలను పడేస్తున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శి సహకారంతో నిఘా ఉంచి కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

- లింగపాలెం



రాజ్యసభకు ఎంపికైన రేణుకా చౌదరిని చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఆదివారం కలసి అభినందించారు. మందలపు సాయిబాబు చౌదరి, మందలపు వీరభద్రరావు, దండ బుచ్చిబాబు, ఎర్ర ఏసుబాబు, కాకర్ల మురళి, తదితరులు రేణుకా చౌదరికి అభినందనలు తెలిపారు.

తపనా చౌదరికి మద్దతుగా ప్రచారం

కామవరపుకోట, ఫిబ్రవరి 25: తపనా ఫౌండేషన్ అధినేత గారపాటి సీతారామాంజనేయచౌదరి ఏలూరు ఎంపీ అభ్యర్థిగా బిజెపి తరపున పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆదివారం జబర్దస్త్ టీమ్ కామవరపుకోట, కళ్ళచెరువు, తడికలపూడి గ్రామాల్లో ప్రచారాలు నిర్వహించింది. టీమ్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గారపాటి సీతారామాంజనేయచౌదరిని ఎంపీగా గెలిపిస్తే పార్లమెంటు పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, నగరాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని, ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు ఉత్సాహంగా పాటలు పాడుతూ, గేయాలాపన చేస్తూ ఆకర్షించారు. తపనా ఫౌండేషన్ ప్రతినిధులు తగు ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ పార్టీకి మద్దిపాటి రాజీనామా

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి మద్దిపాటి శ్రీనివాసరావు ఆదివారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావుకు పంపినట్లు తెలిపారు. జెట్టి గురునాధరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయగా ఆయనకు మద్దతుగా తాను రాజీనామా చేయడం జరిగిందని శ్రీనివాసరావు తెలిపారు. జెట్టితో కలిసి పనిచేస్తానన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** క్యాట్‌లో ప్రతిభ కనబరిచన శ్రీచైతన్య విద్యార్థులను ఘన సత్కరించారు. సర్టిఫికెట్లు, మెరిట్ సర్టిఫికెట్లు పొందిన భానుశ్రీ, గోకృష్ణధనుష్, ధర్మతేజను అభినందించారు. డాక్టర్ రవికిరణ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. సుధాకర్, స్వాతి, జ్యోతి పాల్గొన్నారు.
- ఎమ్మెల్యే ఆళ్ళనాని ఆదేశాల మేరకు వైసీపీ నగరశాఖలో పలు పదవులకు కార్యదర్శిలను నియమించారు. నగర మైనార్టీసెల్ కార్యదర్శిగా షేక్ ఖాదర్ బాబా, బీసీసెల్ కార్యదర్శిగా కేజేవిన్ పుండరీ కస్‌హందు, నగర కార్యదర్శిగా బొడ్డేటి సుబ్బారావు, సవల వరపు నారాయణరావును నియమించారు. నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు.
- **కుక్కునూరు :** వింజరంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ సభ్యుడు కూరపాటి రామారావు లింగమూర్తి అలియాస్ లింగన్నకు విప్లవ జోహార్లు అర్పించారు. బడుగువర్గాల అభ్యున్నతికి లింగన్న చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కలింపూడి సుందర్రావు, గోడ ఏసుపాదం, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** మండలంలో సోమవారం ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవం చేస్తారని జడ్పీటీసీ సూరిబాబు తెలిపారు. తెడ్లంలో సచివాలయం, గుడ్లపల్లి, కె.జగ్గవరం, బంధంచర్ల, టి.నరసాపురంలో నూతన భవనాలు ప్రారంభోత్సవాలు చేస్తారని సూరిబాబు తెలిపారు.
- **ఉంగుటూరు :** ఆనంద నిలయం నిర్మాణానికి నారాయణపురం మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీనివాసరావు పెళ్లి రోజును పురస్కరించుకుని రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం నాడు జరిగిన మండల మానవత సమావేశం అధ్యక్షులు గంజి రవి అధ్యక్షత వహించారు. మానవత సేవలు విస్తృతం చేయాలని సూచించారు. సమావేశంలో శీతాల సత్యనారాయణ, వేగేశ్న సూర్య నారాయణరాజు, గురువెల్లి రాజారావు, పుల్లారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం చేబ్రోలు సిద్ధి వినాయక ఆలయ కమిటీ సత్సంగ్ సభ్యులు ఆదివారం నాడు పడాల వృద్ధాశ్రమంలోని సభ్యులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించినట్లు నిర్వాహకురాలు గుత్తా ధనలక్ష్మి తెలిపారు.
- **నిడమర్రు :** పెదనింద్రకొలనులో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. సీసీ డ్రైయిన్లు, భీమేశ్వరస్వామి కళావేదిక, రథశాల, వేణుగోపాలస్వామి రథం ప్రారంభించారు. జడ్పీటీసీ కోడే కాశీ విశ్వనాథ్, ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మి, జిల్లా వ్యవసాయమండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముగ్గళ్ళ యాకోబు, పుప్పాల మెహర్‌కుమార్, నౌడు అచ్యుతరామారావు తదిరతులు పాల్గొన్నారు.

సచివాలయంపై వైసీపీ ఫ్లెక్సీ తొలగింపు



ముసునూరు, ఫిబ్రవరి 25: సచివాలయ భవనంపై వైసీపీ ఫ్లెక్సీ శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మండల అధికారులు స్పందించారు. ఆదివారం ఎంపీడీవో సీహెచ్.పద్మావతీ దేవి ఫ్లెక్సీని సిబ్బందితో తొలగించారు. వలసపల్లి సచివాలయ సిబ్బందికి మోమోలు జారీ చేయాలని సూపరింటెండెంట్ కె.సాయిరామును ఆదేశించారు. ప్రభుత్వ భవనాలపై రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించకుండా ఉంటే సచివాలయ సిబ్బందిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

అది ఆక్రమణే : చిన్నం



నూజివీడు, ఫిబ్రవరి 25: నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన భూమి ఆక్రమణ జరిగినట్టు తాను చేసిన ఆరోపణకు కట్టుబడి ఉన్నానని, మాజీ ఎమ్మెల్యే చిన్నం రామ కోటయ్య తెలిపారు. ఆదివారం నూజివీడులో తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు 1977లో కోర్టుద్వారా వచ్చిన మ్యాప్ ప్రకారమే తాము ఈ భూమిలో ప్రహరీ గోడను ఏర్పాటు చేసినట్లు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఆక్రమణకు గురైన భూమికి సంబంధించిన లే అవుట్‌ను ఆయన మీడియాకు చూపారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు..



చాట్రాయి, ఫిబ్రవరి 25: మండలంలోని సూరంపాలెం నుంచి 12 మంది మహిళా భక్తులు ఆదివారం కాలినడకన ద్వారకా తిరుమల చిన్న వెంకన్న దర్శనానికి వెళ్లారు. తమ కుటుంబాలను చల్లగా చూస్తే ద్వారకా తిరుమల కాలినడకన వస్తామని మొక్కుకున్నామని, మొక్కు తీర్చుకోటానికి వెళుతున్నట్టు మహిళా భక్తులు చెప్పారు.

గోవిందరాజులు కుటుంబీకులకు పరామర్శ

ముదినేపల్లి, ఫిబ్రవరి 25 : ఇటీవల మరణించిన ముదినేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కరేటి గోవిందరాజులు కుటుంబాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పరామర్శించారు. ఆదివారం బొమ్మినంపాడులో జరిగిన గోవిందరాజులు సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ, ఏపీ స్వచ్ఛాంధ్ర మిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు, ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, చందన ఉమామహేశ్వరరావు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి బొప్పన సుందర రామయ్య, ములకలపల్లి సర్పంచ్ నువ్వుల కోటేశ్వరరావు తదితరులు గోవిందరాజులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 25: నూజివీడు ట్రిపుల్ ఐటీ రోడ్డులో పంజాబీ దాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. నూజివీడు నుంచి ట్రిపుల్ ఐటీ వైపు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో శుక్రవారం సైకిలిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఆసుపత్రికి తరలించగా శనివారం చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడని, గుర్తు తెలియని మృతుని వివరాలు తెలిస్తే నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని నూజివీడు పట్టణ సీఐ మూర్తి తెలిపారు. మరిన్ని వివరాలకు 89779 17599లో సంప్రదించాలని కోరారు.



మంకొల్లు వద్ద తమ్మిలేరు లింక్ చానల్‌పై ఇరుకు వంతెన


4 గ్రామాల ప్రజలు..

40 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా..

పట్టించుకోని అధికారులు ›› ఇరుకు వంతెనతో ప్రజల పాట్లు

చాట్రాయి, ఫిబ్రవరి 25: మండలంలోని మంకొల్లు గ్రామం వద్ద తమ్మిలేరు ప్రాజెక్టు లింక్ చానల్‌పై ఉన్న ఇరుకు వంతెనతో ఇబ్బందులు పడుతున్నాం మహాప్రభో, విస్తరించాలంటూ 4 గ్రామాల ప్రజలు 40 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 55 ఏళ్ల క్రితం తమ్మిలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో టీఆర్పీ లింక్ చానల్‌పై ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లు మాత్రమే నడిచేలా వంతెన నిర్మించారు. అయితే ఈ వంతెనపై నుంచి నిత్యం గౌరీనగర్, మర్రిబంధం, మంగపేట, చీపురుగూడెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ఇరుకు వంతెన కారణంగా గ్రామాల్లోకి లారీలు, బస్సులు వచ్చే అవకాశం లేదు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్లతో ఇరుకు వంతెన అవతలకు తరలించి లారీలకు ఎగుమతులు చేయవలసి వస్తున్నది. దీంతో రైతులకు ఆర్థిక భారం ఎక్కువవుతోంది. ప్రజలు బస్సు ఎక్కాలంటే ఇరుకు వంతెన దాటి మంకొల్లు రావాలి.. 40 ఏళ్ల నుంచి గ్రామానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులకు ఈ సమస్యపై మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కోనేరు రంగారావు, ఎంపీలు గద్దె రామ్మోహన్, లగడపాటి రాజ్‌గోపాల్ తదితరులు ఇరుకు వంతెన విస్తరణకు కృషి చేశారు కానీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల ఇబ్బందులు గమనించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులే : మండలపు జగదీష్, రైతు, చీపురుగూడెం



ఈ ఇరుకు వంతెనతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం, మామిడి కాయలు ఇతర పంటలు రవాణా చేయటానికి లారీలు గ్రామాల్లోకి వచ్చే అవకాశం లేక వ్యయప్రయాసలకు లోనవుతున్నాం. సమస్య పరిష్కరించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించటం లేదు. రైతులు, ప్రజల ఇబ్బందులు పరిశీలించి ఇరుకు వంతెన విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రహదారులు.. కుంగుతున్నాయ్!

- కలిదిండి మండలంలో కుంగిపోయిన బీటీ రహదారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంలోనూ సమస్య.
- పెరిగిన లారీలు, టిప్పర్ల రద్దీతో కల్వర్టులు కూలిపోయే ప్రమాదం
- ఆందోళనలో విద్యార్థులు

కలిదిండి మండలంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్లు తారు వేయకపోవటంతో నిర్మాణ దశలోనే కుంగుతున్నాయి. సుమారు మూడేళ్ల క్రితం వీటిని నిర్మించారు. ఇంత వరకు తారు రోడ్డుకు నోచుకోకపోవటంతో గుంతలు పడి అధ్వానంగా తయారై ప్రమాదకరంగా మారటంతోపాటు ప్రజాధనం వృథా అవుతోంది. ఇక ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెం నుంచి పెదగొన్నూరు మీదుగా ఉప్పరగూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి కుంగుతోంది. ఈ రహదారి ప్రారంభం నుంచి ఐదు కల్వర్టుల వద్ద రహదారి కుంగి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.



కుంగిన శాంతినగరం బీటీ రోడ్డు

కలిదిండి, ఫిబ్రవరి 25: రూ.4 కోట్లతో నిర్మించిన శాంతినగరం - పెదలంక బీటీ రోడ్డు పలు చోట్ల కుంగి గ్రావెల్ అండలుగా విరిగి కాలువలో పడుతోంది. 2021లో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. 2022 ఆగస్టు కల్లా నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఇంత వరకు గ్రావెల్ రోడ్డుపై తారు వేయకపోవటంతో రోడ్డుపై పగుళ్లు ఏర్పడి గోతులు పడటంతో వాహనదారులు అదుపు తప్పి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పాతాళ భోగేశ్వరస్వామి ఆలయం నుంచి సంతోషపురం దుర్గమ్మ ఆలయం వరకు బీటీ రహదారి నిర్మించారు. గ్రావెల్ రోడ్డుపై ఇంత వరకు తారు వేయలేదు. దీంతో గ్రావెల్ రోడ్డు మధ్యలో పగుళ్లు ఏర్పడి కుంగుతోంది. పలు చోట్ల గ్రావెల్ అండలుగా విరిగిపడుతోంది. దీంతో వాహనదారులు మండిపడుతున్నారు. కొండంగి పల్లిపాలెం నుంచి యడవల్లి వరకు నిర్మించిన బీటీ రహదారి కూడా గుంతలు పడి అధ్వానంగా ఉన్నా తారు రోడ్డుకు నోచుకోలేదు. గ్రావెల్‌పై తారు వేయాలని పాలకులు, అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ బీటీ రోడ్లపై తక్షణమే తారు వేయకపోతే కోట్లాది రూపాయలతో నిర్మించి గ్రావెల్ రోడ్డు పూర్తిగా కుంగి శిథిలమయ్యే ప్రమాదం ఉందని పలువురు ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి పక్కాగా రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీరాజ్ ఏఈఈ వివరణ

ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈఈ ఫణిని వివరణ కోరగా, ఏప్రిల్ నెలలో శాంతినగరం - పెదలంక, భోగేశ్వరస్వామి సంతోషపురం, కొండంగి పల్లిపాలెం - యడవల్లి బీటీ రహదారులపై తారు వేస్తామన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల తారు రోడ్డు నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు.



పెదగొన్నూరు రోడ్డులో ఈడేపల్లి డ్రైన్ వద్ద కుంగుతున్న రహదారి

ముదినేపల్లి మండలంలో...

ముదినేపల్లి: భారీ వాహనాలు, అధిక లోడు వాహనాల రాకపోకలు పెరగటంతో ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెం నుంచి పెదగొన్నూరు మీదుగా ఉప్పరగూడెం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి కుంగుతోంది. ఈ రోడ్డు ప్రారంభం నుంచి ఉన్న అయిదు కల్వర్టుల వద్ద రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. లారీలు, టిప్పర్ల రద్దీ పెరగటంతో కల్వర్టులు కూడా కూలిపోయే ప్రమాదం నెలకొంది. ఈడేపల్లి మైనర్ డ్రైన్, బొలికి డ్రైన్, పెదగొన్నూరు న్యూ చానల్, గుమ్మి చెరువు వద్ద కల్వర్టులపై రోడ్డు కుంగింది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు ప్రమాదకరం ఉంది. విశ్వనాద్రిపాలెం, ఉప్పరగూడెం నుంచి పెదగొన్నూరు హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలకు సైకిళ్లపై వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడుగునా గోతులతో నిండి ఉన్న ఈ రహదారిపై భారీ వాహనాల రద్దీ పెరగటంతో పురాతన కాలం నాటి పైపు కల్వర్టులు దెబ్బతింటున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే కల్వర్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రూప్-2 ప్రశాంతం

ఏలూరులో 83.67 శాతం, పశ్చిమలో 84.80 శాతం హాజరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రూప్ -2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సమయానికి గంటముందే అభ్యర్థులు కేంద్రాలకు వచ్చారు. హాల్‌టిక్కెట్, గుర్తింపు కార్డు పరిశీలన, తనిఖీల తర్వాత కేంద్రంలోకి అనుమతించారు. ఏలూరులో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ పరిశీలించారు. భీమవరంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రశాంతి

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25 : జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని జిల్లా జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 37 పరీక్షా కేంద్రాల్లో 14,546 మందికి అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 12,336 (84.80 శాతం) హాజరయ్యారని, 2,210 హాజరు కాలేదన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షలు పూర్తయ్యేవరకు ఎటువంటి ఆటంకం ఏర్పడకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటరింగ్ చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షించిన ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి శివనారాయణరెడ్డిని, పరీక్షల నిర్వహణలో తోడ్పాటును అందించిన ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి జయంతి, ఏఎస్‌వోఏ నాగలక్ష్మీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి పీహెచ్‌జీఆర్ పాపారావు, పర్యవేక్షకులు ప్రసాద్, సిబ్బంది, తదితరులను జేసీ అభినందించారు. పట్టణంలోని శ్రీవిష్ణు కాలేజీ పరీక్షా కేంద్రంలో జేసీ పరిశీలించారు. పరీక్షా పేపర్లు స్ట్రాంగ్ రూమ్‌కి చేరేవరకు వాహనాలకు పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు.



నూజివీడు ఎమ్మీ కళాశాలలో పరీక్షలకు వెళుతున్న అభ్యర్థులు

నరసాపురం టౌన్ : పట్టణ, మండలంలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. వైఎన్ కళాశాల, సూర్య, మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్షలు జరిగాయి. అన్ని కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏలూరు కలెక్టరేట్: ఏలూరు జిల్లాలో 39 పరీక్షాకేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్ -2 పరీక్షలకు 13,977మంది హాజరు కావాల్సి ఉండగా 11,696 మంది (83.68 శాతం) అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 2,281 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, సీఆర్ రెడ్డి ఉమెన్స్ కళాశాలలో పరీక్షాకేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రూప్-2 పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. సీఆర్.రెడ్డి కళాశాల, తదితర కళాశాలల్లో నిర్వహించిన పరీక్షాకేంద్రాలను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పరిశీలించారు.ఆర్డీవో ఖాజావలీ, ఎఫ్‌పిఐఐసీ జోనల్ మేనేజరు కె.బాబ్జి తదితరులు ఉన్నారు.

ఏలూరు క్రైం : ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిలు పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా ఇంటర్ క్యాంపస్ సెంటర్, సీఆర్‌రెడ్డి కళాశాల, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు.

నూజివీడు టౌన్: ఏపీపీఎస్సీ గ్రూప్ -2 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నూజివీడు కేంద్రంగా మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో 2,288 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 2,109 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు అధికారులు తెలిపారు.

పెద్దింటమ్మకు ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ పూజలు



పూజలు చేస్తున్న కమిషనర్ నరేష్ దంపతులు

కైకలూరు, ఫిబ్రవరి 25: కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు చేశా రు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి రావడంతో ఆలయ ఆవరణ భక్తజన సందోహంగా మారింది. అమ్మవారికి రాష్ట్ర ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ ఎస్. నరేష్ దంపతులు పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులతో కలసి ఆలయ అధికారి కేవీ గోపాలరావు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలను నిర్వహించగా కమిషనర్ దంపతులను శేష వస్త్రాలతో సత్కరించారు. భక్తులు అమ్మవారికి పాల పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను నిర్వహించారు.

నేడు టీడీపీలో చేరనున్న సారథి బృందం

నూజివీడు, ఫిబ్రవరి 25: పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సోమవారం ఉదయం 10 గంటలకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో తన అనుచరులతో ఆ పార్టీలో చేరనున్నారు. తన కార్యాలయం నుంచి భారీ కాన్వాయ్‌తో మంగళగిరి పార్టీ కార్యాలయం చేరుకుంటారు. అక్కడ తన అనుచరులైన విజయవాడ వైసీపీ టౌన్ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఇటీవలే వైసీపీలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన చంద్రశేఖర్‌తో కలసి ఆయన టీడీపీలో చేరనున్నారు. ఇప్పటికే సారథికి నూజివీడు టీడీపీ అభ్యర్థిగా టిక్కెట్ కేటాయించిన విషయం తెలిసిందే. మంగళవారం నూజివీడు రానున్న పార్థసారథి నూజివీడు మండలం సీతారాంపురం గ్రామం వద్ద నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, నూజివీడు టౌన్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో సారథి నూజివీడు మండలంలోని పలు గ్రామాల గుండా ప్రయాణించి నూజివీడు పట్టణం ద్వారా ఆగిరిపల్లి మండలం చేరుకుంటారు. సాయంత్రం ఆగిరిపల్లిలో భారీ సభలో ఆయన ప్రసంగిస్తారు. కార్యక్రమాన్ని భారీ ఎత్తున జరిపేందుకు టీడీపీ యంత్రాంగం సమాయత్తం అవుతోంది.



ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాటుచేసిన గుడారాలు

నేటి నుంచి శిలువగట్టు తిరునాళ్లు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 25: నూజివీడు శిలువగట్టు పుణ్యక్షేత్ర తిరునాళ్ళ సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్టు శిలువగట్టు పుణ్యక్షేత్ర రెక్టార్ రెవరెండ్ ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్ అన్నారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ తిరునాళ్ళకు వేలాదిగా భక్తులు, మతాలకతీతంగా పాల్గొని శిలువనాథుడి దీవెనలు పొందుతారని తెలిపారు. తిరునాళ్ళ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయటం జరిగిందన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు వీరాస్వామి మృతి



ముసునూరు, ఫిబ్రవరి 25: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ దొడ్డుల వీరాస్వామి(80) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కోటగిరి హనుమంతురావు శిష్యుడిగా పేరొందిన వీరాస్వామి టీడీపీ బలోపేతానికి విశేష కృషి చేశారు. సర్పంచ్‌గా ఆయన గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథి వీరాస్వామి పార్థివ దేహానికి పూలమాలవేసి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించి మాట్లాడుతూ వీరాస్వామి మృతి పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాముల గంగాధరరావు, సర్పంచ్ కంచర్ల వాణి, గ్రామ టీడీపీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, గ్రామ ప్రముఖులు వీరాస్వామికి నివాళులర్పించారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

కలిదిండి, ఫిబ్రవరి 25 : మూల్లంకలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం పలు అంతర్గత సీసీ రహదారులను ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, సర్పంచ్ మహాదేవ్, విజయబాబు, ఎంపీటీసీ బాలు, సొసైటీ చైర్మన్ అన్నవరం పాల్గొన్నారు.



సీతనపల్లిలో భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాల పంపిణీ

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కైకలూరు, ఫిబ్రవరి 25: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు విజ్ఞతతో ఓటు వేసి టీడీపీని అధికారంలోకి తేవాలని టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం సీతనపల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారన్నారు. మంచినీటి సరఫరా సరిగా లేక ప్రజలు తాగునీటికి సైతం ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో అన్నివర్గాల వారు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపే చంద్రబాబుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, టీడీపీ నాయకులు పళ్ళెం తాతారావు, జోసఫ్ తంబి, పంతగాని సురేష్, పార్టీ గ్రామ నాయకులు వీరగాని కనకదుర్గారావు, కట్టా కనకదుర్గాప్రసాద్, వీరగాని సుబ్బారావు, నాగులపాటి పరమేశ్వరరావు, దండే జాన్ బెన్ని, యాళ్ళ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



శిలువగట్టు తిరునాళ్లకు 'బర్మా' విరాళం

నూజివీడు, ఫిబ్రవరి 25: నూజివీడులోని శిలువగట్టు పుణ్యక్షేత్ర తిరునాళ్ళు ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్నాయి. ఈ తిరునాళ్ళకు నూజివీడు జనసేన నాయకుడు బర్మా ఫణిబాబు రూ.10 వేలు విరాళాన్ని ఆదివారం తిరునాళ్ళ నిర్వాహకులకు అందించారు.

కృష్ణ ప్రసాద్‌కు టీడీపీ నేతల అభినందన



ముదినేపల్లి, ఫిబ్రవరి 25 : పెడన అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంపికైన కాగిత కృష్ణప్రసాద్‌ను ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు అభినందించారు. ఆదివారం కృష్ణప్రసాద్‌ను ఆయన నివాసంలో టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, పార్టీ మండల నాయకులు చల్లగుళ్ల ఆదిత్య, బొంగు రవికుమార్, వీరిశెట్టి కొండలరావు తదితరులు కలసి అభినందించారు. రానున్న ఎన్నికల్లో కృష్ణప్రసాద్ విజయానికి తమవంతు సహకారం అందిస్తామని పార్టీ నాయకులు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కైకలూరు రూరల్ సీఐ

శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు

మండవల్లి, ఫిబ్రవరి 25: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవచ్చని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ అన్ని చర్యలను తీసుకుంటోందన్నారు. మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోగులకు టీడీపీ నాయకుడి చేయూత



ముదినేపల్లి, ఫిబ్రవరి 25: పేరూరు గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి పీడితుడు వీర్ల వెంకట రత్నంకు చికిత్స నిమిత్తం టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ముదినేపల్లికి చెందిన బత్తిన వెంకటేశ్వరరావుకు రూ.10 వేలు అందజేశారు. ఆదివారం బాధితులకు వినోద్ తరఫున పేరూరులో మాజీ సర్పంచ్ వీర్ల నాగేశ్వరరావు, నాయకులు పుట్టి లక్ష్మణస్వామి తదితరులు సహాయాన్ని అందజేశారు.



రామాలయ నిర్మాణానికి విరాళం

ముదినేపల్లి, ఫిబ్రవరి 25 : ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంలో నిర్మిస్తున్న కోదండ రామాలయానికి కైకలూరు టీకేఎం చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేలు విరాళాన్ని అందజేసింది. ఈ విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు వీరంకి చక్రపాణి, తోట నానికి ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు టీకేఎం నాని తరఫున తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆదివారం అందజేశారు.